
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

సోమవారం 5 ఫిబ్రవరి 2024



మల్లు దొర వారసుడి దుర్భర జీవనం

- అనారోగ్యం, అర్ధాకలితో అలమటిస్తున్న గాం బోడి దొర
- ఆదుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినా పట్టించుకోని పాలకులు

- వార్త 8వ పేజీలో..



మల్లుదొర మనుమడు బోడి దొర

పర్యాటకుల కోలాహలం

బొర్రా గుహలు మొదలుకుని లంబసింగి వరకు రద్దీ



చెరువులవేనం వద్ద మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని సందర్శనీయ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతుండడం, మంచు అందాలకు ప్రకృతి సోయగాలు మరింత ద్విగుణీకృతం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటకుల సందడి కొనసాగింది.

ప్రస్తుతం ఏజెన్సీలో చలి ప్రభావం, పొగమంచు కొనసాగుతుండడమే సందర్శకుల తాకిడికి కారణమని తెలుస్తున్నది. కాగా అనంతగిరి మండలం బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస వ్యవసాయ క్షేత్రం, పెదలబుడు గిరిజన గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయిగెడ్డ, పెదబయలు మండలంలో తారాబు జలపాతం, పాడేరు మోదకొండమ్మ ఆలయం, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి, చెరువువేనం, లంబసింగి ప్రాంతాలను పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించారు.

వంజంగి మేఘాల కొండ వద్ద..

పాడేరు రూరల్: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగి మేఘాల కొండకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. దూర ప్రాంతాల నుంచి శనివారం రాత్రే పాడేరు చేరుకుని, ఆదివారం వేకువజామున వంజంగి మేఘాల కొండకు వచ్చారు. ఇక్కడ మంచు అందాలను ఆస్వాదించారు.

లంబసింగి వద్ద..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. పర్యాటక సీజన్ ముగుస్తుండడంతో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలు రాష్ట్రాల నుంచి పర్యాటకులు లంబసింగికి క్యూ కడుతున్నారు. ఆదివారం లంబసింగికి వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. దీంతో ఉదయం నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పచ్చని కొండలు, దానిని తాకుతూ పయనించే మంచు మేఘాలను తిలకించి పరవశించారు. చెరువులవేనం ప్రకృతి అందాలను కెమెరాల్లో బంధించేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. సాయంత్రం వరకు లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో రద్దీగా కనిపించాయి.



వంజంగి మేఘాల కొండపై సందర్శకులు



లంబసింగిలో మంచు

జి.మాడుగుల @ 9.9

- తగ్గని చలి తీవ్రత
- దట్టంగా పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగడంతో చలి, పొగమంచు ప్రభావం తగ్గడం లేదు. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. జి.మాడుగులలో 9.9, పెదబయలులో 11.8, ముంచంగిపుట్టులో 12.5, అరకులోయలో 13.5, పాడేరులో 14, హుకుంపేటలో 14.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. అలాగే మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురుస్తున్నది. ఏజెన్సీలో రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది.



పాడేరులో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు

చింతపల్లి, జీకేవీధిలో..


చింతపల్లి: గిరిజన గ్రామాల్లో చలి ప్రజలను వణికిస్తున్నది. ఆదివారం చింతపల్లిలో 13.5, జీకేవీధిలో 13.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ తెలిపారు. మరో వారం రోజుల పాటు ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం లంబసింగి, తాజంగి, చింతపల్లి, ఆర్వీనగర్, జీకేవీధి ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచే శీతలగాలులు అధికంగా వీస్తున్నాయి. దీంతో సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం పదిన్నర గంటల వరకు చలి ఉధృతి అధికంగా వున్నది.

రా.. కదలి రా!

నేడు గొండుపాలెంలో టీడీపీ బహిరంగ సభ



గొండుపాలెంలో 'రా.. కదలిరా' బహిరంగ సభా వేదిక



- హాజరుకానున్న పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు
- భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు

అనకాపల్లి/ కె.కోటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'రా.. కదలి రా!' నినాదంతో సోమవారం మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు, టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉదయం 11.30 గంటలకు ఇక్కడకు చేరుకుని సుమారు రెండు గంటలపాటు ప్రసంగించనున్నారు. రా.. కదలి రా! సభ కోసం సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, మీడియా ప్రతినిధులు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మద్దతుదారులు. ఇలా వివిధ వర్గాల వారి కోసం ప్రాధాన్యతాక్రమంలో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభా వేదికకు సమీపంలో హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు వేర్వేరుగా స్థలాలను కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిన తరువాత తొలిసారి అనకాపల్లి జిల్లాలో వస్తుండడంతో బహిరంగ సభను విజయవంతం చేయడానికి, భారీ ఎత్తున జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు. చోడవరం, కె.కోటపాడు, విశాఖపట్నం నుంచి గొండుపాలెం వచ్చే దారులన్నీ స్వాగత ఫ్లెక్సీలతో నిండిపోయాయి.



సభకు వచ్చే ప్రజలు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు

ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు

గొండుపాలెంలో సోమవారం జరగనున్న సభ ఏర్పాట్లను ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పైలా ప్రసాదరావు, లాలం కాశీనాయుడు, దాడి రత్నాకర్, కిమిడి నాగార్జున, మల్లిక్ తదితరులు పర్యవేక్షించారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల నుంచే కాకుండా విశాఖపట్నం జిల్లా పెందుర్తి, భీమిలి, గాజువాక, అల్లూరి జిల్లా పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున సభకు హాజరవుతారని పార్టీ నాయకులు తెలిపారు. జనసమీకరణకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్...

- ఉదయం 10 గంటలకు చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరతారు.
- 11.20 గంటలకు కె.కోటపాడు మండలం గొండుపాలెం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11..30 గంటలకు రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు వస్తారు
- 1.35 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు
- 1.40 గంటలకు సభావేదిక నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 1.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కనిపూడిలో జరిగే 'రా.. కదలిరా' సభకు వెళతారు.



పరుగు తీస్తున్న శుభమన్ గిల్, అక్షరపటేల్

సెంచరీతో ఆదుకున్న శుభమన్ గిల్

మరోసారి నిరాశ పరిచిన రోహిత్ శర్మ

- టామ్ హార్ట్‌లీ చేతికి చిక్కిన భారత్ బ్యాటర్లు
- ఇంగ్లండ్ విజయలక్ష్యం 399
- ఆట ముగిసే సమయానికి 67/1
- మూడోరోజూ భారీగా హాజరైన ప్రేక్షకులు

..... వివరాలు 7వ పేజీలో



శుభమన్ గిల్

ఓపీఎస్ కోసం నినదించిన ఉద్యోగులు

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష

- వార్త 7వ పేజీలో



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన 'సాగర సంగ్రామ దీక్ష' శిబిరంలో సీపీఎస్‌ను రద్దుచేయాలని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

బేబి కిట్ల పంపిణీకి బ్రేక్

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా అందజేత



ప్రస్తుతం చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో సొంతంగా బేబీ కిట్ కొనుగోలు చేసుకుని శిశువులకు రక్షణ కల్పిస్తున్న బాలింతలు

- వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిపివేత
- రూ.1000 ఖర్చు చేసి కొనుక్కుంటున్న బాలింతలు
- ఆర్థిక స్థోమత లేనివారు దుస్తుల్లో శిశువులను చుట్టి రక్షణ కల్పిస్తున్న వైనం

చింతపల్లి, ఫిబ్రవరి 4:

ప్రభుత్వాస్పత్రిలో జన్మించిన శిశువులకు వైసీపీ ప్రభుత్వం బేబీ కిట్లు ఇవ్వకపోవడంతో బాలింతలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో శిశువుల రక్షణ కోసం రూ.1000కు పైగా ఖర్చు చేసి బేబీ కిట్లు కొనుక్కోవలసి వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా బేబీ కిట్లు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వాస్తవానికి నవజాత శిశువులకు వెచ్చదనం చాలా అవసరం. అప్పుడే జన్మించిన శిశువులను రెండు, మూడు నెలల పాటు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించాలి. ఈ విషయాన్ని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం వైద్యుల సిఫారసుతో శిశువుల సంరక్షణకు రూ.2000 విలువైన ఎన్టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా పంపిణీ చేసేది. ఆస్పత్రిలో ప్రసవం పొందిన తల్లికి వెంటనే వైద్యులు బేబీ కిట్‌ను అందజేసేవారు. అయితే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉచిత బేబీ కిట్ల పంపిణీని నిలిపివేసింది. అప్పటి నుంచి శిశువుల సంరక్షణకు అవసరమైన బేబీ కిట్‌లను తల్లులే కొనుగోలు చేసుకుంటున్నారు. బేబీ కిట్లు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమతలేని ఆదివాసీలు వస్త్రాలతోనే శిశువులకు రక్షణ కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిపోవడం, శిశువుల రక్షణకు అవసరమైన బేబీ కిట్లు ఇవ్వకపోవడంతో ఆదివాసీ బాలింతలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బేబీ కిట్లు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలో ఉచితంగా పంపిణీ చేసిన బేబీ కిట్‌తో బాలింత (ఫైల్ ఫొటో)

హైవేపై ప్రయాణమంటే

హడల్

రింతాడ- లంబసింగి మార్గంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

- దుమ్ము ధూళి రేగుతుండడంతో వాహనచోదకుల అవస్థలు



చింతపల్లి- లంబసింగి మార్గంలో ఎగసిపడుతున్న ధూళి

చింతపల్లి, ఫిబ్రవరి 4:

రింతాడ- లంబసింగి మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో దుమ్ము, ధూళి రేగుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

రాజమహేంద్రవరం నుంచి చింతపల్లి, పాడేరు, అరకు మీదుగా విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం లంబసింగి బ్లాక్ పరిధిలో జీకేవీధి మండలం రింతాడ నుంచి ... మిగతా 8వ పేజీలో

అభ్యర్థులు 50 వేలు ఖాళీలు 8 ?

ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ ఖాళీలివే!

- జిల్లా విద్యాశాఖకు అందిన సమాచారం
- రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీల సంఖ్య 1,728
- అత్యధికంగా కర్నూలు జిల్లాలోనే 1,646 పోస్టులు
- మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి కేవలం 82
- అధికారుల తీరుపై ఆశావహుల ఆగ్రహం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ముందు నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం హడావిడిగా విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఆశావహులను ఉసూరుమనిపించేలా కనిపిస్తోంది. ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్న వారికి తాజా నోటిఫికేషన్ అశనిపాతంలా పరిణమించనుందనే వాదన వినిపిస్తోంది. కొద్దిరోజుల కిందట నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు

సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే.. ఎస్జీటీలు మూడొంతులు, ఒక వంతు స్కూల్ అసిస్టెంట్ పోస్టులుంటాయి. కానీ ప్రస్తుతం విడుదల చేయనున్న డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 1,728 మంది ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారని సమాచారం. వీటిలో ఒక్క కర్నూలు జిల్లాలోనే 1,646 ఖాళీలున్నట్టు చెబుతున్నారు. మిగిలిన జిల్లాల్లో నాలుగు, పది చొప్పున పోస్టులు ఉండగా, ఆరు జిల్లాల్లో ఒక్క ఎస్జీటీ పోస్టు కూడా లేదు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కేవలం ఎనిమిది ఎస్జీటీ పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు వివరాలు అందాయని తెలిసింది.



50 వేల మంది నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మంది అభ్యర్థులు ఎస్జీటీ పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారు. చివరిసారిగా 2018 అక్టోబరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీ చేసింది. వీటిలో ఎస్జీటీ పోస్టులు మూడు వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,500 ఉన్నాయి. మిగిలినవి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి స్పెషల్ టీచర్ పోస్టులు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా విడుదల చేయనున్న నోటిఫికేషన్‌లోనూ కనీస ఎస్జీటీ పోస్టులు లేకపోవడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా డీఎడ్ పూర్తిచేసి వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. వీరంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం విశాఖ నగరంతో పాటు అవనిగడ్డ వంటి ప్రాంతాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం ఎనిమిది పోస్టులే ఉండడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. టీచర్ కావాలన్న తమ ఆశలను ప్రభుత్వం చంపేస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రతి జిల్లాలో కనీసం 300 పోస్టులను భర్తీచేసేలా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క కర్నూలు జిల్లాలోనే వేలాది ఖాళీలు ఎలా ఏర్పడ్డాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

» జోగంపేట బాలుర వసతిగృహంలో సంఘటన

గొలుగొండ, ఫిబ్రవరి 4: మండలంలోని జోగంపేటలో వున్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యుదాఘాతానికి గురై ఒక విద్యార్థి మృతిచెందాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. జోగంపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 93 మంది వుంటున్నారు. పాతమ్లలంపేట గ్రామపంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామానికి చెందిన తుబిరె దావీద్‌రాజ్(12) జోగంపేట హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతూ, సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో వుంటున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో దుస్తులు ఉతుక్కొని, ఆరబెట్టుకోవడానికి మరో విద్యార్థితో కలిసి మేడపైకి వెళ్లాడు. వాటర్ పైపులైన్ పక్కనే వున్న ఇనుప పైపుపై దుస్తులు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పక్కనే వున్న సహచర విద్యార్థి బిగ్గరగా కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది మేడపైకి వెళ్లారు. అపస్మారకస్థితిలో పడివున్న దావీద్‌రాజ్‌ను గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారావు హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులను ఎస్ఐ విచారించారు. దావీద్‌రాజ్ దుస్తులు ఆరబెట్టిన ఇనుప పైపునకు కరెంట్ ఎర్త్ అవుతున్నట్టు గుర్తించామని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లాడ్జిలో నరసన్నపేట వాసి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4: స్థానిక ఒక లాడ్జిలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొడ్డుపల్లి గ్రామానికి చెందిన శిర్లాపు దుర్గారావు (55 నుంచి 60 ఏళ్లు) ఆదివారం మృతి చెందాడు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 31వ తేదీన అనకాపల్లిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన ఒక లాడ్జిలో శిర్లాపు దుర్గారావు రూమ్ తీసుకున్నాడు. రెండు రోజులుగా ఇక్కడే ఉండి భోజనం చేయలేదని, ఇతడు లివర్ ఇబ్బందులతో వైద్యం పొందుతున్నాడని సీఐ శంకరరావు తెలిపారు. రెండు రోజులుగా రూమ్ తలుపులు దగ్గరకు వేసి ఉంచాడని ఆదివారం ఉదయం అపస్మారకస్థితిలో ఉన్న దుర్గారావును రూమ్‌బాయ్ చూశాడన్నారు. ఆయన వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా వారు వచ్చారన్నారు. భార్య రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ శంకరరావు తెలిపారు. ఈయన మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులు పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని సీఐ శంకరరావు తెలిపారు.

న్యాయంపూడిలో దొంగతనం

నక్కపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని న్యాయంపూడిలో గోరింట వరలక్ష్మి ఇంటిలో దొంగతనం జరిగినట్టు సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. శనివారం ఉదయం వరలక్ష్మి ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చేసరికి బీరువా తెరచివుండడంతో దొంగతనం జరిగినట్టు ఆమె గుర్తించినట్టు ఆయన చెప్పారు. బీరువాలో వున్న అరతులం బంగారం చైను, రూ.40వేలు నగదు, 20తులాల వెండి చోరీ జరిగినట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి కిటికీ పగులగొట్టి దొంగలు ఇంటిలోకి వెళ్లినట్టు గుర్తించారు. క్లూస్ టీం వివరాలు సేకరిస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

వలంటీర్ హత్య కేసు లోతుగా విచారణ

» పోలీసుల అదుపులో మరో ముగ్గురు

మాకవరపాలెం, ఫిబ్రవరి 4: మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీర్ హరినాథ్ హత్య కేసును పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈ ఘటన జరిగి ఇప్పటికే నాలుగు రోజులైంది. హరినాథ్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నాయని ప్రచారం జరగడంతో ఇప్పటికే పలువుర్ని స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. శనివారం మధ్యాహ్నం లచ్చన్నపాలేనికి చెందిన మహిళను, రోలుగుంట మండలం కొత్తూరుకు చెందిన తాపీమేస్త్రీని, అలాగే కత్తిపూడి గ్రామానికి చెందిన సరుగుడు వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. ఇంత వరకు లచ్చన్నపాలెంలో సుమారు 10మందిని విచారించారు. మృతదేహం వద్ద లభ్యమైన సెల్‌ఫోన్‌లోని సమాచారం ఆధారంగా విచారణ దాదాపు చివరి దశకు చేరుకుందని పోలీసులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారిందని చెప్పవచ్చు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతిచెందాడు. దొప్పెర్లకు చెందిన గవిరెడ్డి తరుణ్ (20) ఈనెల రెండున అచ్యుతాపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన తరుణ్‌ని విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యాధికారులు శస్త్రచికిత్స చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆయన ఆదివారం మృతిచెందాడు.



మృతుడు తరుణ్(ఫైల్)

గంజాయితో నలుగురి అరెస్టు

జి.మాడుగుల, ఫిబ్రవరి 4: మండలంలో గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్ఐ శ్రీనావాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వాహనాలు తనిఖీలు చేపడుతున్న సమయంలో 2.33 కిలోల లిక్విడ్ గంజాయితో వీరు పట్టుబడ్డారన్నారు. ఈ ఘటనలో కేరళ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు సినేశ్, జోషేప్, అనకాపల్లి జిల్లాకు చెందిన వెంకటేశ్, సురేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ వివరించారు.

డ్వాక్రా మహిళలకు బెదిరింపులు

» ఆసరా కార్యక్రమానికి రాకపోతే పథకాలు తొలగిస్తాం

» రవాణా ఖర్చులు గ్రూపు సభ్యులే భరించాలి

» కొత్తూరు వెలుగు సీసీ రాము హెచ్చరిక

కొత్తూరు(అనకాపల్లి), ఫిబ్రవరి 4 : మేజర్ పంచాయతీ కొత్తూరు ముత్రాసు కాలనీకి చెందిన డ్వాక్రా మహిళలకు వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ (సీసీ) దూలం రాము బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు వాట్సప్ గ్రూపుల్లో వాయిస్ రికార్డ్ ద్వారా సందేశాన్ని పంపారు. సోమవారం మాడ్గూరులో జరగనున్న వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు కార్యక్రమానికి రాకపోతే సంక్షేమ పథకాలు తొలగిస్తామని హెచ్చరించారు. కొత్తూరు క్లస్టర్‌లోని 42 గ్రూపుల మహిళలు తప్పనిసరిగా హాజరుకావాలని హుకుం జారీ చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఖర్చులు ఇవ్వబోమని, సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు రాలేదని, ఈసారి అలా చేస్తే రుణమాఫీ పథకాలు వర్తించవని స్పష్టం చేశారు. గతంలో ఈయనపై డ్వాక్రా సంఘాల నుంచి అధిక మొత్తంలో వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో ఈ విధంగా హుకుం చేయడం పట్ల డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా మాడుగులలో జరగనున్న చంద్రబాబు బహిరంగ సభకు డ్వాక్రా మహిళలు వెళ్లకుండా ఈ విధంగా కుట్ర పన్నుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అలాగే వెలుగు సీసీ రాముపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి : ఒకరి అరెస్టు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఆదివారం కోడి పందాల శిబిరంపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ అట్టాడ విభీషణరావు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559



భరత్‌ను అభినందిస్తున్న రోహిత్ శర్మ



స్టేడియంలో జాతీయ పతాకంతో అభిమానులు



బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లండ్ ఆటగాడు బెన్ డకెట్



మ్యాచ్ తిలకిస్తున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ



మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉదయం విద్యార్థుల క్యూ



మ్యాచ్ చూస్తున్న సీపీ రవిశంకర్ అయ్యనార్

సెంచరీతో ఆదుకున్న శుభమన్ గిల్

మరోసారి నిరాశ పరిచిన రోహిత్ శర్మ... ఇంగ్లండ్ విజయలక్ష్యం 399

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 4: ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ రసకందాయంలో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియాను శుభమన్ గిల్ సెంచరీతో (104) ఆదుకున్నాడు. మిగిలిన బ్యాటర్లు అంతగా రాణించకపోవడంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులకు చాపచుట్టేసింది. ఇంగ్లండ్ ముందు 399 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది.

తొలి ఇన్నింగ్స్‌లో 14 పరుగులకే అవుటైన కెప్టెన్ రోహిత్ శర్మ.. రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలమై కేవలం 13 పరుగులకే పెవిలియన్ చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టిన మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (17) రెండో ఇన్నింగ్స్‌లో ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. అవుట్‌సైడ్ ఆఫ్ స్టంప్ మీదుగా ఆండర్సన్ వేసిన బంతిని డ్రైవ్ చేసేందుకు ప్రయత్నించి ఫస్ట్ స్లిప్‌లోని రూట్‌కు క్యాచిచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6) మరోసారి అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు.

భళా

వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (104) తొలి బంతి నుంచి దూకుడుగా ఆడాడు. రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు కొట్టి 60 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్థ సెంచరీ సాధించాడు. 52వ ఓవర్‌లో బషీర్ బౌలింగ్‌లో సింగిల్ చేసి సెంచరీ పూర్తిచేశాడు. శుభమన్ గిల్‌కు విశాఖలో ఇది తొలి సెంచరీ కాగా, టెస్టు కెరీర్‌లో రెండోది కావడం విశేషం. తర్వాత మరో నాలుగు పరుగులు జోడించిన గిల్... బషీర్ బౌలింగ్‌లో బెన్ ఫోక్స్‌కు క్యాచిచ్చి అవుటయ్యాడు. అక్షర పటేల్ (45), అశ్విన్ (26) మినహా మరెవరూ రాణించలేదు. కాగా తొలి టెస్టులో భారత్ బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టిన స్పిన్నర్ హార్ట్‌లీ రెండో టెస్టు సెకెండ్ ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. మూడో రోజు ఆటలో శ్రేయాస్ అయ్యర్, అక్షరపటేల్, కులదీప్ యాదవ్, బుమ్రాలను అవుట్ చేశాడు. కాగా రెండో రెండు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది.

పోటెత్తిన ప్రేక్షకులు

మూడోరోజు ఆదివారం కావడంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. పెవిలియన్ వైపు స్టాండ్స్ నిండిపోయాయి. భారత్ బ్యాటింగ్ జరిగినంతసేపు కేరింతలు, చప్పట్లతో స్టేడియం హోరెత్తింది. సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించారు. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండీశ్వరినాథ్ ఆదివారం మ్యాచ్‌ను వీక్షించారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ గ్యాలరీలో సందడి చేశారు.



వికెట్ తీసిన ఆనందంలో అశ్విన్

రుద్రభూమి నుంచి రియల్టర్ రోడ్డు

» గ్రామపెద్దల సహకారం

» శ్మశానం చుట్టూ ప్రహరీ కట్టిస్తానన్న రియల్టర్

» గ్రామ పెద్దలకు భారీ స్థాయిలో ముడుపులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4:

ఆవరాజాంలో గ్రామ పెద్దలంతా ఏకమై రుద్రభూమి నుంచి ఒక రియల్టర్‌కు 60 అడుగుల వెడల్పు రోడ్డుకు అనుమతించారు. ఇందుకు ప్రతిగా రుద్రభూమి చుట్టూ రియల్టర్ ప్రహరీ నిర్మిస్తున్నాడు. కాని ఈ దారికి భూమిని కేటాయించినందుకు పెద్దలకు భారీగా ముడుపులు ముట్టాయని గ్రామస్థులు గుసగుసలాడుకుంటున్నారు.



రుద్రభూమి మధ్యనుంచి రియల్టర్ ఏర్పాటు చేస్తున్న రోడ్డు

ఆవసోమవరం పంచాయతీ సర్వే నంబర్ 91లో 1.84 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవలే ఆవసోమవరం పంచాయతీని రెండుగా విడదీసి కొత్తగా ఆవరాజాం పంచాయతీని ఏర్పాటు చేశారు. దీంతో సర్వే నంబరు 91 ఆవరాజాం పంచాయతీ పరిధిలోకి వచ్చింది. అంతకు ముందే ఈ సర్వే నంబరులో 84 సెంట్లు ఆవరాజాం వెళ్లడానికి రోడ్డులో ఉంది. మిగిలిన ఎకరాలో 76 సెంట్లలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాలను ఆనుకొని రుద్రభూమి ఉంది. పాఠశాలకు దగ్గరలో రుద్రభూమి ఉన్నందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వారికి కనబడకుండా ప్రహరీని నిర్మించారు. కాగా పాఠశాల, రుద్రభూమి వెనుక 20 ఎకరాలను ఒక రియల్టర్ కొని వెంచర్ వేస్తున్నాడు. అయితే ఈ వెంచర్‌లోకి వెళ్లడానికి ప్రధాన రహదారి లేదు. గతంలో రియల్టర్ పాఠశాలకు, రుద్రభూమికి మధ్య నుంచి వెంచర్‌కి దారి కోసం కేటాయించాల్సిందిగా అచ్యుతాపురం తహసీల్దార్‌కు ఆర్జీ పెట్టాడు. అది ప్రభుత్వ భూమి అయినందున కేటాయించలేమని తహసీల్దార్ నిరాకరించారు. దీంతో రియల్టర్ గ్రామ పెద్దలతో సంప్రదింపులు జరిపి పాఠశాలకు, రుద్రభూమికి మధ్య నుంచి 60 అడుగుల రోడ్డుకు భూమి కేటాయిస్తే రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మించి ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. పెద్దలు అంగీకరించడంతో శరవేగంతో రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతున్నది. అయితే పైకి రుద్రభూమి చుట్టూ రియల్టర్ ప్రహరీ నిర్మిస్తున్నప్పటికీ గ్రామ పెద్దలకు భారీగా ముడుపులు ముట్టాయని గ్రామస్థులు గుసగుసలాడుతున్నారు. రియల్టర్ రోడ్డు కోసం సుమారు ఏడు సెంట్లు పోతోంది. మిగిలిన 23 సెంట్లు రుద్రభూమి కుచించుకుపోయిందని గ్రామస్థులు అంటున్నారు. ప్రభుత్వభూమిని గ్రామపెద్దలు రియల్టర్‌కి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అధికారులు విచారణ జరిపితే నిజాలు బయటపడతాయని గ్రామస్థులు అంటున్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

వైసీపీలో గుర్తింపు లేదు

» డిప్యూటీ సీఎం పోలీసు కేసులు పెట్టిస్తున్నారు

» వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి ఆవేదన

» భర్త, మరికొందరు నేతలతో కలిసి వైసీపీకి రాజీనామా

» నేడు చంద్రబాబు సమక్షంలో 500 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు వెల్లడి

దేవరాపల్లి, ఫిబ్రవరి 4: వైసీపీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లేదని అధికార పార్టీకి చెందిన మండలంలోని వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమపై పోలీసు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రం తన భర్త, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బలరామమూర్తి, మరికొంతమంది వైసీపీ నేతలతో కలిసి తన నివాసం వద్ద మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, తనతోపాటు పలువురు నాయకులు, సుమారు 500 కుటుంబాల వారు వైసీపీకి రాజీనామా చేసి సోమవారం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరగనున్న 'రా.. కదలిరా' సభలో చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు చెప్పారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి బలరామమూర్తి మాట్లాడుతూ, 25 సంవత్సరాల నుంచి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వెంట వున్నానని, జడ్పీటీసీ సభ్యుడిగా, తరువాత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి తన వంతు కృషి చేశానని చెప్పారు. అయినాసరే తనకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా ఏడాది నుంచి పార్టీకి తనను, తన కుటుంబాన్ని దూరంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధం లేని విషయాల్లో కలుగజేసుకొని తనను మానసికంగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా పోలీసు కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. అవమానాలు, వేధింపులకు గురిచేసే పార్టీలో ఎందుకు వుండాలని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం తీరుతో విసుగు చెంది టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో కలిగొట్లకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డు జగదీశ్వరరావు, వాకపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెనగంటి సింహాచలంనాయుడు, వైసీపీ నాయకులు దొగ్గ రమేశ్, గొర్లి గోవింద, గొర్రుపోటు సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం నినదించిన ఉద్యోగులు

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సాగర సంగ్రామ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా సీపీఎస్ రద్దుకోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల ఆశలను వమ్ము చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పీఆర్‌టీయూ నేత గోపినాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు తక్కువ సమయం ఉందని, చివరి అవకాశంగా ఓపీఎస్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మాట తప్పిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13.2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యుడు నాత ప్రసాద్ మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించేలా ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చేయించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని సీపీఎస్ రద్దు హామీని ఎందుకు అమలుచేయలేదని సీఎంను ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ రమాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్ష ప్రాంగణంలో సీపీఎస్ అంతిమయాత్ర నిర్వహించారు. పాత పెన్షన్ పేరుతో ఏర్పాటు చేసిన సమాధి వద్ద నేతలు నివాళులర్పిస్తూ నిరసన తెలిపారు. పలువురు మహిళా ఉద్యోగులు చెవిలో క్యాబేజీలు పెట్టుకుని నిరసన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని నామవరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం నామవరం గాంధీనగర్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నక్కపల్లి వైపు నుంచి వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వి.అనిత, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి వెంటనే స్పందించారు. గాయపడిన వ్యక్తిని పరామర్శించారు. వెంటనే 108కి సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

89 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని 89 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు వైసీపీ నేతలతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఎనిమిది సొసైటీలకు కొత్త కమిటీలను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుండా ప్రతి సొసైటీకి ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ప్రభుత్వం నామినేట్ చేస్తూ వస్తోంది.

ఈ కమిటీల గడువు గత నెల 29తో ముగిసింది. వీటి కాలపరిమితి పొడిగించాల్సి ఉన్నా ఆలస్యం కావడంతో ఈనెల రెండో తేదీన నిర్వహించాల్సిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజనసభ చివరి నిమిషంలో రద్దు చేశారు. కాగా పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు (ఈ ఏడాది జూలై 30 వరకు) పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో 98 సొసైటీలుండగా రాంబిల్లి మండలం దిమిలి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఇంకా గడువుంది.

మిగిలిన వాటిలో 89 సొసైటీలకు ఇప్పటి వరకు వున్న కమిటీలనే కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలవగా, మిగిలిన ఎనిమిది సొసైటీలకు కొత్తగా ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. వీటిల్లో ఐదు సొసైటీలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో, మూడు సొసైటీలు అనకాపల్లి జిల్లాలో వున్నాయి. అనకాపల్లి గౌరీ సొసైటీ, రావికమతం మండలం మేడివాడ సొసైటీలకు కొత్తవారిని నియమించారు. తుమ్మపాల సొసైటీకి గతంలో ఉన్న కమిటీని రద్దుచేసి సహకార శాఖ అధికారులతో కొత్త కమిటీని నియమించారు.

ఫ్లైయాష్ లారీలతో గొల్లలపాలెం వాసుల ఇక్కట్లు

పరవాడ, ఫిబ్రవరి 4: ఫ్లైయాష్ లారీల కాలుష్యంతో గొల్లలపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రహదారి వెంబడి వందలాది లారీలు సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిపై కనీసం టార్పాలిన్ కూడా కప్పకపోవడంతో బూడిద ఎగిరి ఇళ్లల్లోకి, వాహనాలపై, పంటలపై పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూడిద కారణంగా కళ్లల్లో మంటలతో పాటు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. పెద్ద ఎత్తున ఫ్లైయాష్ ఎగిసి పడడంతో అనారోగ్య బారిన పడుతున్నామని, తరచూ ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునేవారే లేకపోయారని గ్రామస్థులు వాపోతున్నారు. రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి దారుణంగా తయారైందని గ్రామస్థులు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బూడిద లారీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



లారీల రాకపోకలతో ఎగిసిపడుతున్న ఫ్లైయాష్

ఓటమి భయంతో జగన్‌రెడ్డికి వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందుతామనే సంకేతాలు అందుతుండడంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు ప్రారంభమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు ప్రజల నుంచి అందు తున్న ఆదరణను ఓర్వలేక వైసీపీ నేతలు తర్జన భర్జన పడుతున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో సోమవారం జరగనున్న రా.. కదలి రా.. బహిరంగసభకు విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ సభకు రెండు లక్షల మంది హాజరుకానున్నట్టు ఆయన చెప్పారు. ఐదేళ్లలో చేసిన అప్పులు గురించి గాని, ప్రభుత్వ భూములను బ్యాంకులను పెట్టిన తనఖాలు గురించి గాని, ప్రత్యేక హోదా, నిరుద్యోగ నిర్మూలనపై పెదవి విప్పకపోవడం అన్యాయమన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలం కాశీనాయుడు, కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

వృద్ధురాలిని మోసగించిన వలంటీర్ తొలగింపు

» ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4: మండలంలోని జేవీపాలెంలో ఎద్దు లక్ష్మి అనే వృద్ధురాలిని మోసగించి, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేలు దొంగలించిన వలంటీర్ నడిగట్ల శ్రీనును విధుల నుంచి తొలగించినట్టు ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వేలి ముద్రలు వేయించుకొని వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్యగణేష్, మరో ఇద్దరి సహకారంతో తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు కాజేసినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరి వలంటీర్లపై కార్యదర్శి పి. చంద్రకళతో కలిసి విచారణలో నిర్వహించినట్టు చెప్పారు. ఇద్దరి వలంటీర్లలో నడిగట్ల శ్రీను మాత్రమే వృద్ధురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేలు అపహరించినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. వెంటనే వలంటీర్ శ్రీను దొంగలించిన మొత్తం నగదును తిరిగి బాధితురాలు లక్ష్మికి ఇప్పించడం జరిగిందన్నారు. దీంతో వలంటీర్ శ్రీనును తొలగిస్తూ స్థానిక కార్యదర్శి పి. చంద్రకళ పత్రాన్ని అందజేసిందన్నారు.



వలంటీర్ శ్రీనుకు తొలగింపుపత్రం అందిస్తున్న కార్యదర్శి చంద్రకళ



ఆలయంలో మోదకొండమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 4: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని వంజంగి మేఘాల పర్వతాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం రద్దీగా మారింది. అమ్మవారికి ఘటాలను సమర్పించి పండగ జరుపుకున్న మైదాన ప్రాంత భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. సాయంత్రం వరకు అమ్మవారి సన్నిధిలో వారంతా గడపడంతో ఆలయం సందడిగా మారింది. ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ సభ్యులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, సిద్ధినాతి కొండలరావు, బొడ్డు ముకుందరావు తదితరులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అదే విధంగా పాడేరు ఘాట్‌లో ఉన్న మోదకొండమ్మ పాదాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'క్రైస్తవుల అభ్యున్నతికి గిడ్డి ఈశ్వరి కృషి'


మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని సన్మానిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు

చింతపల్లి, ఫిబ్రవరి 4: గిరిజన ప్రాంతంలో క్రైస్తవుల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ప్రత్యేక కృషి చేస్తున్నారని ఇవాంజలిస్టు రవి అబ్రహం అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రైస్తవ సువార్త సభల్లో ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరైన గిడ్డి ఈశ్వరిని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి, జి.మాడుగుల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇవాంజలిస్టు మాట్లాడుతూ తాను గిరిజన ప్రాంతంలో పర్యటించిన సమయంలో గిడ్డి ఈశ్వరి గురించి ప్రజలు గొప్పగా చెప్పారన్నారు. ఆమె ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో క్రైస్తవుల అభివృద్ధి కోసం శ్రద్ధ తీసుకున్నారని, ప్రతి ఏటా పాడేరు కేంద్రంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని తెలిపారన్నారు. రానున్న రోజుల్లోనూ క్రైస్తవుల సంక్షేమం కోసం ఆమె పనిచేయాలన్నారు. గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ పాఠశాలలో చదవడం వల్ల క్రైస్తవ క్రమశిక్షణ నేర్చుకున్నానన్నారు. గిరిజన ప్రాంత క్రైస్తవుల కోసం చంద్రబాబు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని, వచ్చే ఎన్నికల్లో తన విజయానికి క్రైస్తవులు ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, పాస్టర్లు కాలేబు, జాన్ విక్టర్, జాన్, మల్లేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

షర్మిల సభను విజయవంతం చేయాలి

» కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

చింతపల్లి, ఫిబ్రవరి 4: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సభను ఆదివాసీలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు కోరారు. మండల కేంద్రంలో ఈ నెల 10న ఏర్పాటు చేసిన షర్మిల బహిరంగ సభ కోసం కాంగ్రెస్ నాయకులు ఆదివారం స్థల పరిశీలన చేశారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. పీసీసీ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల తొలిసారిగా చింతపల్లి వస్తున్నారన్నారు. ఆదివాసీలకు దివంగత నేత వైఎస్ఆర్, కాంగ్రెస్ పార్టీ అంటే అపారమైన అభిమానమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభిమానులు గత రెండు ఎన్నికల్లోనూ వైసీపీలోకి మద్దతు పలికారని, ప్రస్తుతం జగన్ పాలనపై వారంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఈ మేరకు వైసీపీకి వెళ్లిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీలు తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. షర్మిల రాకతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. ఈ మేరకు జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్నపడాల్, నాయకులు గురుమూర్తి, మొట్టడం బాలరాజు, సాగిన కృష్ణ పడాల్, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల రాజ్యాధికారం డీజేపీతోనే సాధ్యం

» దండకారణ్య జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెండా ఏలియా


కార్యక్రమంలో మాట్లాడుతున్న చెండా ఏలియా

అరకులోయ, ఫిబ్రవరి 4: దండకారణ్యంలో ఆదివాసీల రాజ్యాధికారం దండకారణ్య జనతా పార్టీ (డీజేపీ)తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెండా ఏలియా అన్నారు. స్థానిక గిరిజన్ భవన్‌లో పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిల్లో రాణితో పాటు ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యంలో అపార ఖనిజ వనరులను దోచుకునేందుకు ప్రధాన పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి రాజకీయాల వల్ల గిరిజనాభివృద్ధి జరగనే జరగదన్నారు. తమ పార్టీలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. దండకారణ్య జనతా పార్టీకి ఒక్కసారి ఓటు వేసి గెలిపిస్తే చట్టసభల్లో గిరిజన జాతి అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రంజిత్‌కుమార్, కొండపల్లి కాంతారావు, జాన్, కె.శీనివాస్, ఎం.రమేశ్ కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన


రహదారి సౌకర్యం కల్పించాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4: కించాయిపుట్టు పంచాయతీలోని వర్కుగుమ్మి, గడ్డిబంద గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని ఆదివారం స్థానిక ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నేత అతిథి మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలకు రహదారి లేకపోవడం, గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయపై కాజ్‌వే నిర్మాణం చేపట్టకపోవడంతో ఏ చిన్నపాటి అవసరానికైనా వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

మల్లు దొర వారసుడి దుర్భర జీవనం

» అనారోగ్యం, అర్ధాకలితో అలమటిస్తున్న గాం బోడి దొర

» ఆదుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినా పట్టని పాలకులు


మల్లుదొర మనుమడు బోడి దొర... బోడి దొరకు పాదాభివందనం చేస్తున్న మోదీ (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, ఫిబ్రవరి 4: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడు గాం మల్లు దొర స్వాతంత్రోద్యమంలో ముఖ్య భూమిక పోషించారు. అల్లూరి అడుగు జాడల్లో నడిచి ఆంగ్లేయులపై తిరగబడ్డారు. దేశం కోసం పోరాడి అసువులు బాశారు. అయితే అంతటి మహోన్నత వ్యక్తి మనుమడు గాం బోడి దొర ప్రస్తుతం దుర్భర జీవనం గడుపుతున్నారు. కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ దిబ్బలవీధికి చెందిన ఆయన భార్య మరణానంతరం తన కుమార్తె వద్దే ఉంటున్నారు. ఆర్థిక స్థోమత లేక అనారోగ్యంతో ఉన్నా వైద్య సేవలు పొందలేకపోతున్నారు. తినడానికి తిండి, కట్టుకోవడానికి సరైన దుస్తులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి సీతారామరాజు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 2022 జూలై 4న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వేదికగా బోడి దొరను ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా సత్కరించారు. బోడి దొరకు పాదాభివందనం చేసి స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కూడా ఇచ్చారు. అయితే ఆ తరువాత ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బోడి దొర దిబ్బలవీధిలో తనకున్న పూరిపాకలో దయనీయ స్థితిలో ఉన్నారు. పాలకులు, అధికారులు స్పందించి తనకు సహాయం చేయకపోతారా? అనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

వైసీపీ పాలనలో సమస్యలతో సతమతం

» తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆదుకోండి

» మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి రేషన్ డీలర్ల మొర


మాజీ ఎమ్మెల్యే ఈశ్వరికి వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 4: వైసీపీ పాలనలో సమస్యలతో సతమతమవుతున్నామని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఆదుకోవాలని రేషన్ డీలర్లు వేడుకున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని ఆమె స్వగృహంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల డిపోలను నిర్వీర్యం చేసిందన్నారు. కేవలం బియ్యం తప్ప అక్కడ ఎటువంటి నిత్యవసర వస్తువులు ఉండడం లేదన్నారు. డీలర్ల సమస్యను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అప్పుడు గతంలో మాదిరిగానే లబ్ధిదారులకు అన్ని రకాల నిత్యావసర సరకులు డీలర్ షాపుల్లో లభించేలా చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి గంగపూజారి శివకుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు విడతల్లో మహిళలకు రుణ విముక్తి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

అరకులోయ, ఫిబ్రవరి 4: స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో సీఎం జగన్ రుణ విముక్తి కల్పించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు అన్నింటా ప్రాధాన్యం లభిస్తున్నదన్నారు. ఇందులో భాగంగా ఆసరా పథకం కింద డ్వాక్రా రుణాలను మాఫీ చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి మహిళలకు లక్షల రూపాయల్లో రుణాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అరకు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యలింగం, ఎంపీపీ ఉషారాణి, వెలుగు ఏపీఎం అప్పయమ్మ, వెలుగు ఈసి కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ కోసం దివ్యాంగురాలు ఎదురుచూపులు..

» ఐదేళ్లుగా దరఖాస్తు చేస్తున్నా మంజూరుకాని వైనం

» పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు


పింఛన్ కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగురాలు జానకి.. బైక్‌పై తీసుకువెళ్తున్న కుటుంబీకులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 4: మండలంలోని గాలికొండ పంచాయతీ ఆకులూరు గ్రామానికి చెందిన ఆదివాసీ దివ్యాంగురాలు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నది. ఐదేళ్లుగా పింఛన్ కోసం దరఖాస్తు మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయం చుట్టూ చేస్తూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పింఛన్ మంజూరు కాలేదు. దివ్యాంగురాలు ఆవేదనను పలుమార్లు వైసీపీ నాయకులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు.

గాలికొండ పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో జానకి (35)కి పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయవు. ఎక్కడికైనా కాళ్లు, చేతులతో పాకుకుంటూ వెళుతున్నది. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి సైతం కుటుంబ సభ్యుల సహాయం తీసుకుంటున్నది. ప్రస్తుతం సోదరుడి గృహంలో ఉంటుండగా, కుటుంబ సభ్యులే బాగోగులు చూసుకుంటున్నారు. పింఛన్ మంజూరుకు అవసరమైన సదరం ధ్రువీకరణ పత్రం సైతం కుటుంబ సభ్యులు వైద్యాధికారుల నుంచి తీసుకున్నారు. అన్ని అర్హతల పత్రాలతో ఐదేళ్లుగా మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయం వద్ద పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ మంజూరు కావడం లేదని దివ్యాంగురాలు జానకి వాపోయారు. పింఛన్ వస్తే కొంత భరోసాగా ఉంటుందని, అధికారులు స్పందించి పింఛన్ ఇప్పించాలని ఆమె వేడుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు వివరణ కోరగా కిల్లో జానకి దివ్యాంగుల పింఛన్ కోసం గత ఏడాది నవంబరు 6వ తేదీన దరఖాస్తు చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లోగాని, డిసెంబరులోగాని పింఛన్ మంజూరవుతుందని ఆయన చెప్పారు.

జగన్‌కు చెక్ పెడదాం.. చంద్రబాబును సీఎంను చేద్దాం!


బర్సింగిలో మాట్లాడుతున్న టీడీపీ నేత సుబ్బారావు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 4: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ పాలనకు చెక్ పెట్టి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు కోరారు. బర్సింగి పంచాయతీ కేంద్రంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని కుటుంబాలను బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీలో నమోదు చేయించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కనీసం మరమ్మతులకు గురైన రహదారులను కూడా ప్రభుత్వం బాగు చేయలేయలేని పరిస్థితిలో ఉందన్నారు. జగన్ పాలనతో విసుగు చెందిన ప్రజలు టీడీపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, పార్టీ నాయకులు వర్తన పిన్నయ్యదొర, సీదరి సుబ్బారావు, సీదరి లక్ష్మి, నాగబ్బాయి, వినోద్, బాలు, రాంబాబు, కొండబాబు, రాజు, మధు, దివాకర్ పాల్గొన్నారు.

చంపాపట్టి వంతెనకు మోక్షమెన్నడో..?


కర్రలతో ఏర్పాటు చేసిన వంతెనపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 4: మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలో చంపాపట్టి కాజ్‌వేపై వంతెనకు మోక్షం లభించడం లేదు. హుద్‌హుద్ తుఫాన్‌లో కాజ్‌వే కొట్టుకుపోయి పదేళ్లు కావస్తున్నా, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదు. దీంతో గిరిజనులు కాలిబాటన రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణానికి గత ఏడాదిలో అరకులోయ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ వంతెన నిర్మాణంలో కార్యరూపం దాల్చలేదు. వంతెన నిర్మాణం జరిగి రవాణా కష్టాలు తీరుతాయన్న గిరిజనులు ఆశలు అడియాశలయ్యాయి. శిలాఫలకంతో సరిపెట్టి వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడంతో గిరిజనులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే తీరుపై గిరిజనులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చంపాపట్టి కాజ్‌వేలో వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

హైవేపై ప్రయాణమంటే హడల్

... 5వ పేజీ తరువాయి

లంబసింగి వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం గ్రావెల్ వర్కు జరుగుతున్నది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాల వల్ల ధూళి ఎగసిపడుతున్నది. కార్లు, బస్సుల్లో ప్రయాణించే వారికి సమస్య లేకపోయినా జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి రహదారి పనులు జరుగుతున్నపుడు ధూళి ఎగసిపడకుండా కాంట్రాక్టరు నీళ్లతో రోడ్డును తడిపేలా చర్యలు తీసుకోవాలి. అయితే జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టరు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే సంబంధితశాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఈ ప్రాంత వాసులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారిపై ధూళి ఎగసిపడకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

విద్యార్థి మృతిపై ప్రజా సంఘాల ధర్నా


విద్యార్థి మృతిపై డీఎస్‌డబ్ల్యూవోను నిలదీస్తున్న ఆందోళనకారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 4: గొలుగొండ ఎస్టీ బాలుర వసగృహంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీ బాలుర వసతి గృహంలో దావీద్‌రాజ్ అనే విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రి వద్ద ప్రజా సంఘాలు, విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఘటనపై విచారణ చేసి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తామని డీఎస్‌డబ్ల్యూవో అజయ్‌బాబు హామీ ఇచ్చినా ఆందోళనకారులు అంగీకరించలేదు. ముందు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. చివరకు ఆర్డీవో జయరాం వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

☛ సంక్షిప్తంగా..

'చంద్రబాబుతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యం'

సీలేరు, ఫిబ్రవరి 4: గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా సురేశ్ కుమార్ అన్నారు. సీలేరులో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. ఆదివాసీలకు టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన 15 రకాల పథకాలు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే గిరిజన గ్రామాలు బాగుపడతాయన్నారు. టీడీపీ ప్రకటించిన మహాశక్తి మేనిఫెస్టోపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.తిరుమలరావు, కె.సన్యాసిరావు, రాము, బి.కృష్ణ పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు రామునాయుడు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 4: విశాఖలో కలకలం రేపిన తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిచెట్టు రామునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడుతూ విధులకు ఆటంకాలు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ హత్యకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, తహసీల్దార్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధిక భూ వివాదాలు ఉన్న మండలాలకు చెందిన తహసీల్దార్, వీఆర్వో, రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సిహెచ్.రమేష్ కుమార్, కె.కోటిబాబు, వి.రామజోగారావు, ఎస్.అబ్బాయి దొర, జవ్వాది వెంకటలక్ష్మి, వెంగడ లక్ష్మి పాల్గొన్నారు.

జన్‌మన్ పథకంతో విద్యుదీకరణ

కొయ్యూరు, ఫిబ్రవరి 3: పీవీటీజీ గ్రామాల్లో జన్‌మన్ పథకంతో విద్యుదీకరణ జరుతున్నదని ఏపీ ఈపీడీసీఎల్ మండల ఏఈ నాగేశ్వరావు తెలిపారు. కొమ్మిక పంచాయతీలో కొత్త బొర్రంపేట, కర్నికపాలెం, డేగలపాలెం, రేవళ్ల తదితర గ్రామాలలో సిబ్బందితో కలసి జన్‌మన్ పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంతో ఎటువంటి రుసుము అవసరం లేకుండానే విద్యుత్ మీటర్లను అందిస్తున్నట్టు చెప్పారు. ఆధార్ నంబరు, కుల ధ్రువపత్రాలను సమీపంలోని ఏఈ కార్యాలయానికి అందజేసి ఉచిత విద్యుత్ సర్వీసు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ పెద్దబ్బాయి, సహాయకులు రాజు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4: అపరచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని, అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి గస్తీ నిర్వహించి ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగించిన వాహనాలను, పాదచారుల బ్యాగులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో కొత్తవారు సంచరించినా, అనుమానస్పద వ్యక్తులు తారసపడినా పోలీసులకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

జాబ్‌మేళాలను వినియోగించుకోండి

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 4: చింతపల్లి యువజన శిక్షణ కేంద్రంలో ఈ నెల 6న పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ అశోక్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టాటా ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ మేళాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన యువతులకు టాటా కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఎంపికైన యువతులకు శిక్షణ ఇచ్చి, ఐఫోన్ల తయారీలో ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. అర్హులైన గిరిజన ప్రాంత యువతులు విద్యార్హత, ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం అన్నారు. పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అందరూ తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.రామస్వామి, జనం మూల్య, పద్మనాభం, గోపాల్, మోహన్, గజపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా తాగునీటి బోరు


జంగిడివలసలో చుక్క నీరు ఇవ్వని బోరు ఇదే..

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 4: మండలంలో కురిడి పంచాయతీ పరిధిలోని జంగిడివలస అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్మించిన తాగునీటి బోరు మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం వండి పెట్టేందుకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బోరు మరమ్మతులకు గురై సుమారు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పట్టించుకునే నాథులే లేకపోయారని గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిరుయోగంగా ఉన్న తాగునీటి బోరును తక్షణమే మరమ్మతులు చేయించి వినియోగంలో తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.